నమస్తే తెలంగాణ
మెదక్

I | హైదరాబాద్, బుధవారం 7 ఆగస్టు 2024 | MEDAK

ఉమ్మడి మెదక్ జిల్లాలోని పంచాయతీలు, వార్డులు		
జిల్లా	జీపీలు	వార్డులు
సిద్దిపేట	499	4,476
మెదక్	469	4,082
సంగారెడ్డి	647	5,778
మొత్తం	1,615	14,336

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,615 గ్రామపంచాయతీలు, 14,336 వార్డులు

- రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన ఆపరేటర్లకు శిక్షణ పూర్తి
- ఓటర్ల జాబితా రూపకల్పనకు జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు
- పార్టీ రహితంగా పంచాయతీ ఎన్నికల నిర్వాహణ
- మద్దతుదారులతో మంతనాలు జరుపుతున్న ఆశావహులు
- రిజర్వేషన్లపై మల్లగుల్లాలు పడుతున్న నాయకులు

పంచాయతీ పోరుకు కసరత్తు

సిద్దిపేట, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో రాజకీయ సందడి మొదలైంది.అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం ఓటరు జాబితాల సవరణ తదితర వాటిపై దృష్టి సారించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతాయి. ఈ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. ఎన్నికల కమిషన్ ప్రకటించే గుర్తులతో బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి నిర్వహిస్తారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,615 గ్రామ పంచాయతీలు,14, 336 వార్డులు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 499 జీపీలు, 4,476 వార్డులు, మెదక్ జిల్లాలో 469 జీపీలు, 4,082 వార్డులు, సంగారెడ్డి జిల్లాలో 647 జీపీలు, 5,778 వార్డులు ఉన్నాయి. జనవరి 2019లో పంచాయతీ ఎన్నికలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించింది. 1 ఫిబ్రవరి 2024తో పాలక వర్గాల పదవీ కాలం ముగిసింది. దీంతో ఆరోజు నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా తయారీపై జిల్లాలో ఎంపిక చేసిన ఆపరేటర్లకు ఈనెల 2,3తేదీల్లో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఆపరేటర్ల ద్వారా పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లను ఆదేశించింది. దీంతో జిల్లా స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామాల్లో మాజీ ప్రజాప్రతినిధులతో పాటు ఈసారి యువత ఎన్నికల్లో పోటీ చేయటానికి ఇప్పటి నుంచే సన్నాహాలు చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో పోటీ చేయడానికి ఉత్సాహం చూపుతున్న వారంతా అప్పుడే అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోటీ చేస్తే ఎలా ఉంటుంది..? గెలుస్తామా..? లేదా..? రిజర్వేషన్ ఎలా ఉంటుంది..? తదితర అంశాలపై మద్దతుదారులతో మంతనాలు చేస్తున్నారు.

గతంలోనే ఏర్పాట్లు పూర్తి ..

గ్రామ పంచాయతీ ఎన్నికలకు గతంలోనే ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ఏడాది డిసెంబర్‌లోనే సర్పంచ్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్,పోలింగ్ అధికారులను నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియను నిలిపివేశారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు మొగ్గు చూపడంతో మళ్లీ జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. జిల్లాలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలు తదితర వాటిపై అధ్యయనం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రతి 200 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 మంది ఓటర్ల వరకు ప్రిసైడింగ్ అధికారి ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. 650 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఎన్నికల నిర్వహణ పూర్తి కాగానే అదే రోజు ఎన్నికల ఫలితాలు ప్రకటించాల్సి ఉంటుంది అందుకు తగ్గ ఏర్పాట్లు తదితర వాటిపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేలా అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. ఓటర్ల జాబితా సవరణపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. పార్లమెంట్ ఎన్నికల్లోని ఓటరు జాబితాను గ్రామాల్లో వార్డుల వారీగా విభజిస్తున్నారు. ఓటర్ల సంఖ్యను బట్టి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఈ నెల మొదటి వారంలోగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. పంచాయతీ ఎన్నికల్లో ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ బాక్స్‌లు వినియోగిస్తారు. ఎన్ని బ్యాలెట్ బాక్స్‌లు అవసరం అనే దానిపై దృష్టి సారించారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో అన్నీ కష్టాలే వచ్చి పడ్డాయి. గ్రామ పంచాయతీలకు పాలక వర్గాలు లేకుంటే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావు. మరో వైపు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంత వరకు ఒక్క పైసా కూడా నిధులను విడుదల చేయలేదు. దీంతో గ్రామ పంచాయతీలు నిధులు లేక సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమవుతోంది.

రిజర్వేషన్లపై మల్లగుల్లాలు

ఓటరు జాబితా సవరణ పూర్తైన వెంటనే నిర్ణీత గడువులోగా బీసీ రిజర్వేషన్లు పంపించాలని బీసీ కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ నివేదిక ఆధారంగా పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది. ఇప్పుడు ఉన్న పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరుగుతాయా..? లేదా ? అనే దానిపై నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. గత పంచాయతీ ఎన్నికల సమయంలో నూతనంగా పంచాయతీ రాజ్‌చట్టం తీసుకువచ్చింది. దీని ప్రకారం రెండు సార్లు ఒకే రిజర్వేషన్ అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఇదే రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలా..? కొత్త రిజర్వేషన్లు అమలు చేయాలా..? అని రాష్ట్ర ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేక పోతున్నది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ స్థానిక సంస్థల్లో 42 శాతానికి రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చింది. వీటితో పాటు ఉపకులాల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన కాంగ్రెస్ ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటుందా ..? లేదా ..? వేచి చూడాల్సిందే. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా స్థానిక సంస్థల పరిధిలో కులాల గ్రూపుల వెనుకబాటుపై బీసీ కమిషన్ ద్వారా విచారణ జరిపి.. ఆయా చోట్ల ఏనిష్పత్తిలో రిజర్వేషన్లు ఇవ్వాలనేది తేల్చాలని సూచనలు చేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఇలా అన్ని కలిపి కూడా 50 శాతం రిజర్వేషన్లు మించకుండా ఉండాలని స్పష్టం చేసింది.

సిద్దిపేట జిల్లాలో మోటరు పంపుల నుంచి వస్తున్న గోదావరి జలాలు

రంగనాయకసాగర్‌కు గోదావరి జలాలు

ఆనందం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

- రెండు పంపులతో 6600 క్యూసెక్కుల నీటి ఎత్తిపోత

సిద్దిపేట/ చిన్నకోడూరు, ఆగస్టు 6 : వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అనంతగిరి, రంగనాయకసాగర్‌లను కాళేశ్వరం జలాలతో నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఇటీవల నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. స్పందించిన ప్రభుత్వం అనంతగిరి రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను ప్రారంభించింది. మంగళవారం రెండు మోటర్లను ఆన్‌చేయడంతో గోదావరి జలాలు రంగనాయకసాగర్‌లోకి పరుగులు పెట్టాయి. 3 టీఎంసీల సామర్థ్యంగల రంగనాయకసాగర్‌లో ఇప్పటికే 0.68 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. రెండు పంపుల ద్వారా 6600 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్నారు. 24గంటల పాటు పంపులు నిరాటంకంగా నడిస్తే 0.25టీఎంసీల నీరు రిజర్వాయర్‌లోకి చేరనున్నది. శనివారం వరకు నీటిని ఎత్తిపోసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, అప్పటి వరకు నీటి లభ్యతను బట్టి గోదావరి జలాలు ఎత్తిపోయనున్నట్లు అధికారులు తెలిపారు. రంగనాయకసాగర్‌ను గోదావరి జలాలతో నింపుతుండటంతో ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రంగనాయకసాగర్‌కు గోదావరి జలాలు పరుగులు పెడుతుండటంతో వాటిని చూసేందుకు పర్యాటకులు వస్తున్నారు.

రంగనాయక సాగర్‌లోకి వస్తున్న గోదావరి జలాలను చూస్తున్న పర్యాటకులు

'స్వచ్ఛదనం-పచ్చదనం'
జీవితంలో భాగం కావాలి

- ప్రతి ఒక్కరూ శుభ్రతను పాటిస్తూ విధిగా మొక్కలు నాటి పెంచాలి
- ఎల్లమ్మ, కొత్త చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించాం
- రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం

సిద్దిపేట కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులోని కొత్తచెరువును పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఆగస్టు 6: ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రజల జీవితంలో భాగం కావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులోని కొత్తచెరువు వద్ద జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనంలో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి మొక్కలు నాటి, కొత్త చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలంద రూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటి పెంచాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. అపరిశుభ్రత, పర్యావరణం దెబ్బతినడంతో వింత వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని, వీటిని అరికట్టాలంటే సమిష్టిగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పట్టణంలోని ఎల్లమ్మ చెరువు, కొత్త చెరువుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశామన్నారు. కొత్త చెరువు మత్తడిపై బ్రిడ్జి నిర్మించుకొని సిద్దిపేట రోడ్డు నుంచి ఆరెపల్లికి బైపాస్‌రోడ్డుగా మార్చుతామని చెప్పారు. ఇందుకు అధికారులు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. నియోజకవర్గంలో పలు రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇంకా ఎక్కడెక్కడ నిధులు అవసరమో ప్రజలనుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా గుర్తించాలి

మొక్కలు నాటి పెంచడం అనేది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రతి వార్డు, గ్రామంలో విధిగా నిర్వహించాలని, ఇది నిత్యం జరిగే కార్యక్రమం అని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా, చెత్తా చెదారం లేకుండా చేయడం ద్వారా మలేరియా, డెంగీ లాంటి వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. పరిశుభ్రమైన నీటిని మాత్రమే వినియోగించాలన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా పర్యావరణ పరిరక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 20 లక్షల మొక్కలు నాటినట్లు చెప్పారు. చెత్తను సేకరించి సేంద్రియ ఎరువులుగా మార్చే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితా రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి

మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలో విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి, కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్,ఆగస్టు 6 : పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ఆమె మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి మంగళవారం మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలో పర్యటించారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలో ర్యాలీలో పాల్గొని 3వ వార్డులోని రాయరావు చెరువు, తూప్రాన్ మార్గంలోని కోమటికుంటను సందర్శించారు. నాలుగో వార్డు నందు రక్షిత తాగునీటి నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఒకటోవార్డులో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు లక్ష్యంతో ప్రభుత్వం ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వారంలో రెండు రోజులు డ్రైడే గా పాటించాలని, ఇంట్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలిగించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగీ వ్యాధి నియంత్రణలో మెదక్ జిల్లా పనితీరు మెరుగ్గా ఉందని, భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ లైన్లు, తాగునీటి సరఫరా, పైప్‌లైన్లకు దూరంగా అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటాలని సూచించారు.

ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేయాలి

నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను పక్కాగా నిర్వహించి రాష్ట్రంలోనే మెదక్ జిల్లాను పథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జైత్‌రామ్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా చిన్నగొట్టిముక్లలో..

శివ్వంపేట, ఆగస్టు 6 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామాన్ని వారు సందర్శించి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రత్యేకాధికారి ప్రతాప్‌సింగ్, ఎంపీడీవో నాగేశ్వర్‌గుప్తా, ఎంపీవో తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ బాలమణీనరేందర్, మాజీ ఎంపీటీసీ నువ్వుల దశరథ, పాపయ్యచారి పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా అందోల్‌లోని బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మౌలికవసతుల కల్పనకు కృషి

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- సంగారెడ్డి జిల్లా అందోల్-జోగిపేట మున్సిపాలిటీలో మంత్రి పర్యటన

అందోల్, ఆగస్టు 6: వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలికవసతులు కల్పిస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా అందోల్‌లోని బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులు, సిబ్బంది, అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం వసతులు, కల్పించాల్సిన సౌకర్యాలను అగిడి తెలుసుకున్నారు. జోగిపేటలోని వాసవి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవీమాత మండల పూజలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ సుజాత, ఆర్డీవో పాండు, ఆర్యవైశ్య సం ఘం మహిళా అధ్యక్షురాలు రజిని, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్ రంగ సురేశ్, చిట్టిబాబు, డాకూరి శంకర్, రేఖాప్రవీణ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు జూకంటి లక్ష్మణ్, చింతలసు రేశ్, ఎదిరే రమేశ్, రాములు, రఘు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 6 : కొండపోచమ్మ కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు గత 26 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మండిపడ్డారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మంగళవారం ఆమె సంఘీభావం తెలుపుతూ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రైతుల సమస్యలను అర్థం చేసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి రైతులకు భూమికి భూమి లేదా మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమోద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, జడ్పీటీసీ బాబ్యానాయక్, బీఆర్ఎస్ నాయకులు జీపన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, రింగుల ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో కూర్చున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తదితరులు

జయశంకర్ సేవలు మరువలేనివి

- తొలి దశ ఉద్యమానికి ఊపిరి.. మలి దశ ఉద్యమానికి దిక్సూచి
- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 6 : తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ఎంతో మందికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడితే బడుగు బలహీన వర్గాల జీవితాలు బాగుపడతాయని అహర్నిశలు శ్రమించిన గొప్ప వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడేందుకు ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. తెలంగాణ తొలి దశ ఉద్యమానికి ఊపిరి, మలిదశ ఉద్యమానికి దిక్సూచిగా ఆయన నిలబడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేశ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.